
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
విజయనగరం
జిల్లా వార్తలు
ఆదివారం 27 ఏప్రిల్ 2025



ఉపాధి వేతనదారులకు బీమా

విజయనగరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలు దురదృష్టవశాత్తు మరణించినా, వైకల్యం సంభవించినా బీమా అందించేందుకు రెండు పథకాలు అమల్లో ఉన్నాయని డ్వామా పీడీ శారదాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన కింద 18 నుంచి 70 ఏళ్ల మధ్య వయసున్న వేతనదారులు రూ.20 ప్రీమియం ఏటా చెల్లించాలని తెలిపారు. అలాగే ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన కింద 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయసువారు రూ.436 ప్రీమియం ఏటా చెల్లించాల్సి ఉటుందని ఆమె పేర్కొన్నారు.



మత్స్యకార కుటుంబానికి వేట నిషేధ సాయం అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

మాట ఇచ్చాం.. నిలబెట్టుకున్నాం

- వేట నిషేధ సమయంలో రూ.20వేల సాయం విడుదల
- 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు
- శ్రీకాకుళం జిల్లా బుడగట్లపాలెంలో 'మత్స్యకారుల సేవలో' ప్రారంభం

శ్రీకాకుళం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): 'కూటమి ప్రభుత్వ పాలనలో మత్స్యకారుల దశ మారింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మాట నిలబెట్టుకున్నాం. వేట నిషేధ సమయంలో అందించే ఆర్థికసాయం రెట్టింపు చేశాం. దీనివల్ల రాష్ట్రంలో 1,29,178 మంది మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల మేర లబ్ధి చేకూరింది' అని సీఎం నారా చంద్రబాబునాయుడు అన్నారు. గత పాలకుల మాదిరి బటన్ నొక్కకుండా.. ప్రజల మధ్యకు వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని వెల్లడించారు. ప్రజా సంక్షేమమే తన ధ్యేయమని స్పష్టం చేశారు. శనివారం విజయనగరం లోక్‌సభ పరిధిలోని ఎచ్చెర్ల నియోజకవర్గం బుడగట్ల పాలెంలో 'మత్స్యకార సేవలో' పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. మత్స్యకారులు తూరాడ అప్పన్న, అలుపల్లి తవితాయి కుటుంబాలకు చెరో రూ.20వేల చొప్పున ఆర్థిక సాయాన్ని సీఎం అందజేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'మత్స్యకారుల కష్టాలు నాకు తెలుసు. ప్రాణాలను పణంగా పెట్టి సముద్రంలో వేటకు వెళ్లడం.. వారు తిరిగి వచ్చే వరకూ ఆడబిడ్డలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఎదురుచూ డటం నేను స్వయంగా చూశాను. కొందరు వ్యాపారులు బోట్లను ఇచ్చి.. మత్స్యకారుల ఆదాయం వాళ్లే కొట్టేస్తున్నారు. మీ కష్టాలు తీర్చేందుకు నేనున్నాను. మత్స్యకారులు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారు. మత్స్యకార గ్రామాలు టీడీపీకి అండగా నిలబడ్డాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సహాయాన్ని రూ.10వేల నుంచి రూ.20వేల వరకు పెంచామ'ని సీఎం తెలిపారు.

అభివృద్ధి అంటే బటన్ నొక్కడం కాదు..

'గత పాలకుల్లా బటన్ నొక్కి ప్రచారం చేసుకోవడం నాకూ వచ్చు. కానీ చేయాల్సింది అదికాదు. ప్రజలందరికీ సంక్షేమం అందించడమే నా ధ్యేయం. గత పాలకులు ఫిష్ ఆంధ్ర పేరుతో రూ.300 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. ఒక్క మత్స్యకారుని కుటుంబమైనా బాగుపడిందా? టీడీపీ ప్రభుత్వం హయాంలోనే మత్స్యకారుల పిల్లలకు ప్రత్యేకంగా ఆరు రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేశాం. రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకారులకు ప్రతినెలా పింఛన్లు అందిస్తున్నాం. మత్స్యకారులు చేపల వేట సమయంలో మరణిస్తే రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తున్నాం. వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్‌పై రూ. 9 సబ్సిడీ ఇస్తున్నామ'ని సీఎం తెలిపారు.

ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా..

'ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం. ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతాం. నియోజకవర్గంలో (మిగతా 8వ పేజీలో..)




నిర్మాణంలో ఎయిర్‌పోర్టు భవనం

అన్ని వైపుల నుంచి వెళ్లొచ్చు

- విమానాశ్రయ రహదారులపై ప్రత్యేక దృష్టి
- హైవేకు అనుసంధానంగా 23 రోడ్లు
- తొలి విడతలో 18 రోడ్లు అందుబాటులోకి
- తొమ్మిది నెలల్లో పూర్తిచేయాలని లక్ష్యం

విజయనగరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉన్న ప్రభుత్వం అక్కడకు చేరే మార్గాలపైనా ప్రత్యేక దృష్టి పెట్టింది. అనుసంధానంగా వీలైనన్ని ఎక్కువ రహదారులు నిర్మించనుంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు, టెండర్లు ఖరారు తదితర అంశాలను జాతీయ రహదారుల సంస్థ చూస్తోంది. నేషనల్ హైవేస్‌తో పాటు గ్రీన్‌ఫీల్డ్ రహదారులు, రాష్ట్ర రహదారులు ప్రణాళికలో ఉన్నాయి. విమానాశ్రయం అందుబాటులోకి వస్తే విశాఖతో పాటు విజయనగరంలో ట్రాఫిక్ పెరిగే అవకాశం ఉంది. అందుకే ఎయిర్‌పోర్టు అనుసంధాన రహదారుల నిర్మాణంపైనా (మిగతా 8వ పేజీలో..)




మేల్కొనకపోతే.. ముప్పే



- జిల్లాలో పెరుగుతున్న క్యాన్సర్ కేసులు
- ముందస్తు పరీక్షల్లో నిర్ధారణ
- 5,968 బాధితుల గుర్తింపు
- రాష్ట్రంలో జిల్లాకు రెండో స్థానం
- పాలిథిన్ కవర్లతోనూ అపాయం
- ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టని పాలకులు

విజయనగరం రింగురోడ్డు/రాజాం రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి)

రాచపుండు.. క్యాన్సర్!.. నెమ్మదిగా శరీరాన్ని రోగగ్రస్తం చేసే రాకాశి.. పేరు ఏదైనా ఇప్పుడు ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న మహమ్మారుల్లో అగ్రస్థానంలో ఉంది. ఏటా క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో చేపట్టిన స్క్రీనింగ్ పరీక్షల్లో విజయనగరం, కాకినాడ, శ్రీకాకుళం జిల్లాల్లో క్యాన్సర్ రోగులు అధికంగా ఉన్నట్లు తేలింది. విజయనగరం జిల్లా రెండోస్థానంలో ఉంది. కాకినాడలో 6,333 కేసులు నమోదు కాగా, విజయనగరం జిల్లాలో 5,968 కేసులు నమోదయ్యాయి. జన్యుపరమైన కారణాలతో కూడా క్యాన్సర్ బారిన పడుతున్నారు. అలాగే పొగాకు, మత్తుపదార్థాలు వినియోగించే వారు కూడా క్యాన్సర్ వ్యాధికి గురవుతున్నారు. జిల్లాలో నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ బాధితులు ఎక్కువగా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. కాగా క్యాన్సర్ శరీరంలో ప్రవేశించినా చాలా మంది సకాలంలో గుర్తించడం లేదు. ఈ వ్యాధిపై అవగాహన లేక (మిగతా 8వ పేజీలో..)







తక్కువ మందం కలిగిన కవర్లలో వేడి ఆహార పదార్థాలు

పాలిథిన్ కవర్లతో అపాయం..

మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లు లేని రాజాంకు చెందిన ఓ వ్యాపారి రోజూ రెండుమూడుసార్లు కవర్లలో తెచ్చిన టీని తాగేవాడు. ఇటీవల కడుపులో తీవ్రమైన నొప్పి రావడంతో రాజాంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిని ఆశ్రయించాడు. కేన్సర్ లక్షణాలున్నాయని అనుమానం ఉందని వైద్యులు స్పష్టం చేయడంతో అనకాపల్లి సమీపంలో అగనంపూడి వద్ద ఉన్న కేన్సర్ ఆసుపత్రిలో చేరాడు. వైద్య పరీక్షల అనంతరం కేన్సర్ తొలిదశలో ఉందని నిర్ధారించారు. ముందుగా మేల్కొనడంతో అతని ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉంది.

- కర్ణాటకలో హోటళ్లు, రెస్టారెంట్లలో పాలిథిన్, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిలిపివేస్తూ.. ఇటీవల ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అక్కడి హోటళ్లు, రెస్టారెంట్లు, రోడ్డు పక్కన తోపుడుబళ్లలోని ఆహారపదార్థాల శాంపిళ్లను సేకరించి ప్రయోగశాలలకు పంపించారు. 35 చోట్ల తయారైన వాటిల్లో కేన్సర్ కారకాలు ఉన్నట్లు ల్యాబ్‌లో నిర్ధారించారు. దాదాపుగా ఇదే పరిస్థితి మన జిల్లాలోనూ ఉంది.

నివారణ మన చేతుల్లోనే..

ప్రతి ఒక్కరూ 40 ఏళ్లు దాటిన తరువాత ఏడాదికి ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఎక్కువగా మత్తు పదార్థాల వినియోగం వల్ల నోరు, ఊపిరితిత్తుల క్యాన్సర్ సోకుతోంది. వీటి వినియోగాన్ని ఆపేయాలి. అలాగే 40 ఏళ్లు దాటిన మహిళలు ప్రధానంగా మామోగ్రఫీ పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్‌ను నిర్ధారించవచ్చు. 11 నుంచి 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పీసీవీ వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా భవిష్యత్‌లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించవచ్చు. ఏ అనారోగ్య లక్షణమైనా మూడు వారాలకు మించి తగ్గకపోతే ఆలస్యం చేయకుండా వైద్యుడ్ని సంప్రదించాలి. జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ విభాగం ఉంది. ఇక్కడకు వచ్చి క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవచ్చు.

-డాక్టరు పి.విజయలక్ష్మి, మెడికల్ అంకాలజిస్ట్, ప్రభుత్వ సర్వజనాసుపత్రి

ప్లాస్టిక్ కవర్లతో అనేక దుష్పరిణామాలు..

ప్లాస్టిక్ కవర్లలో తెచ్చిన ఆహారపదార్థాలను తింటే వాటి సూక్ష్మ రేణువులు శరీరంలోకి చేరుతాయి. శిశువుల్లో మెదడు, ప్రోస్టేట్ గ్రంధిపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ప్లాస్టిక్ వినియోగం వల్ల కేన్సర్ బారిన పడే అవకాశాలెక్కువని ఇటీవల జరిగిన అధ్యయనాల్లో స్పష్టమైంది.

-డా.గార రవిప్రసాద్, ఎండీ, జనరల్ మెడిసిన్, రాజాం

పాకిస్తానీ జాతీయులుంటే 27లోగా స్వదేశానికి వెళ్లండి: కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడి తర్వాత కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్‌పై అనేక ఆంక్షలు విధించిన నేపథ్యంలో దేశంలో ఉన్న పాకిస్తానీలను ఈనెల 27లోగా పంపించేయాలని కేంద్రం నిర్ణయించిందని కలెక్టరు అంబేడ్కర్ ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు అమలులో భాగంగా జిల్లా పరిధిలో పాకిస్తానీలుంటే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌డీవోలకు ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం వారి వీసాలను రద్దు చేసిందని, సాధారణ వీసాలపై వచ్చిన పాకిస్తానీలు ఏప్రిల్ 27లోగా, వైద్య సేవల వీసాలపై వచ్చిన వారు ఈనెల 29న దేశం విడిచి వెళ్లాలని స్పష్టం చేశారు. 30 తర్వాత అట్టారి సరిహద్దును మూసివేస్తున్న దృష్ట్యా జిల్లాలో పాకిస్తానీయులుంటే గుర్తించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆర్‌డీవోలకు స్పష్టంచేశారు.

అదానీ కంపెనీకి భూములివ్వం

- రెవెన్యూ సిబ్బందిని అడ్డుకున్న మారిక గిరిజనులు 7లో

ఆలయాలకు రూపమిస్తూ.. ఆధ్యాత్మికత వైపు మళ్లిస్తూ..

- ఇదీ జగన్నాథం ప్రత్యేకత
- శిల్పకళా ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు 6లో

గుర్తు పట్టేస్తాయ్!

- కేసుల ఛేదనలో కీలకంగా పోలీసు జాగిలాలు 6లో

అభివృద్ధికి వ్యవసాయం

వ్యవసాయ రంగం ద్వారానే జిల్లాలో వృద్ధి రేటు పెంచగలం. ధాన్యాలు, పండ్లతోటల సాగు, పాడి పరిశ్రమ, మత్స్య సంపద, ఫారెస్టు అభివృద్ధి జరగాలి. ఇందుకు క్షేత్ర స్థాయిలో రొటీన్‌గా పని చేస్తే సరిపోదు. వినూత్నంగా ఆలోచించాలి. భూమినంతా వినియోగంలోకి తీసుకురావాలి. సాగు దిగుబడులు పెరిగేలా చేయాలి. నాణ్యమైన పంట చేతికి వచ్చేలా ప్రయత్నించాలి. మల్టీబుల్ క్రాపింగ్(వివిధ రకాల పంటల సాగు), క్రాప్ డైవర్సన్ (పంట మార్పిడి) జరిగేలా రైతులకు అవగాహన కల్పించాలి. మీరంతా ఈ జిల్లాకు చెందిన ఉద్యోగులు. ఎక్కడ పనిచేసినా జిల్లా పరిధిలోనే ఉంటారు. మీ పనితీరు మీ ప్రాంత ప్రజలకు మేలు చేసేలా ఉండాలి. మొత్తం సమాచారం మీదగ్గర ఉండాలి. ఆదాయం ఎంతమేర పెంచగలరో ఆలోచించండి.

- ఎస్.కోట నియోజకవర్గ సిబ్బందికి శనివారం నాటి సమీక్ష సమావేశంలో కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ దిశానిర్దేశం

- 15 శాతం కంటే ఎక్కువ వార్షిక వృద్ధి రేటు పెంచే దిశగా అడుగులు
- అనుబంధ రంగాల ప్రగతికీ ప్రణాళికలు
- క్షేత్ర స్థాయి ఉద్యోగులకు కలెక్టర్ దిశానిర్దేశం
- జిల్లా వృద్ధికి వినూత్నంగా ఆలోచించాలని సూచన



ఎస్.కోటలో కలెక్టర్ సమీక్ష వేదిక వద్ద ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయం స్టాల్

శృంగవరపుకోట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దాదాపు మూడు లక్షల ఎకరాల సాగు భూమి అందుబాటులో ఉంది. లక్షా ఇరవై మూడు ఎకరాల్లో మాత్రమే పంటలు పండిస్తున్నారు. మిగిలిన భూమిని కూడా వినియోగంలోకి తీసుకొస్తే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుంది. దీనికి అనుబంధంగా పరిశ్రమలు వస్తాయి. తద్వారా స్వర్ణాంధ్ర లక్ష్యం చేరేందుకు అవకాశం ఉంటుంది. ఇదే లక్ష్యంతో మండలం, నియోజకవర్గం, జిల్లా అభివృద్ధి సాధించేందుకు నెలాఖరుకు ప్రణాళికలు తయారు చేసేలా క్షేత్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సిబ్బందికి కలెక్టర్ అంబేడ్కర్ దిశానిర్దేశం చేశారు. గ్రామ స్థాయిలో పని చేస్తున్న ఉద్యోగులతో మాత్రమే వృద్ధి సాధ్యమ వుతుందని ఆయన భావించారు. వారిలో కదలిక తీసుకొచ్చేందుకు గురువారం నుంచి శనివారం వరకు నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహించారు.

2047-విజన్ లక్ష్యంగా..

కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్-2047, రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్రప్రదేశ్-2047 విజన్ ప్లాన్ అమలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. అట్టడగు వర్గాల తలసరి ఆదాయాన్ని పెంచడం ద్వారా ఈ లక్ష్య సాధన దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడం ద్వారా మండలం, జిల్లా, రాష్ట్రంలో 15శాతం కంటే ఎక్కువ వార్షిక వృద్ధిని సాధించాలన్న విజన్‌ను రూపొందిస్తున్నారు. దీని అమలుకు ప్రత్యేక అధికారులతో పాటు నియోజకవర్గ స్థాయిలో శాసన సభ్యులను చైర్మన్లుగా నియమించారు. నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళిక పర్యవేక్షణ బాధ్యతను ఎమ్మెల్యేలకు అప్పగిస్తున్నారు. ప్రతి మూడు నెలలకోసారి నియోజకవర్గం అధికార యంత్రాంగంతో వారు సమీక్షలు నిర్వహించాలి. సాధించిన వృద్ధి, తీసుకున్న నిర్ణయాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందించాలి.

పరిశ్రమల పరిస్థితి

జిల్లాలో రాజాం, బొబ్బిలి, శృంగవరపుకోట, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో మాత్రమే ఎన్నోకొన్ని పరిశ్రమలున్నాయి. ఎస్.కోట నియోజకవర్గం లక్కవరపుకోట మండలంలో సింహాద్రి స్టీల్ (గోల్డ్‌స్టార్), మహామయి, కొత్తవలస మండలంలో జిందాల్ (మిగతా 8వ పేజీలో..)



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి



విజయనగరం రూరల్: ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



భోగాపురం: కర్రోతు బంగార్రాజు



రాజాం: ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్



చీపురుపల్లి: రామ్‌మల్లిక్ నాయుడు, నాగార్జున

చంద్రబాబుకు ఘన స్వాగతం

- శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో కలిసిన జిల్లా నేతలు

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గంలో 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన శాసన సభ్యులు, టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్యనేతలు సీఎంకు ఘనంగా స్వాగతం పలికారు. తమ నియోజకవర్గాలలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిష్కరించాలని విన్నవించారు.

డ్వాక్రా సంఘాలతో పేదరిక నిర్మూలన

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఎచ్చెర్ల/రణస్థలం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక స్వావలంబనకు, పేదరిక నిర్మూలనకు డ్వాక్రా సంఘాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మత్స్యకార సేవలో పేరిట బుడగట్లపాలెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.



మహిళలకు అభివాదం చేస్తున్న ప్రతిభాభారతి

అశోక్ గారూ.. ఇంత ఎండలో వచ్చేశారా?

- హెలీపాడ్ వద్ద ఆసక్తికర సంభాషణ
- ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు ప్రశంసలు

ఎచ్చెర్ల/రణస్థలం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం సముద్ర తీరంలో ఏర్పాటుచేసిన హెలీపాడ్ వద్దకు స్వాగతం పలికేందుకు వచ్చిన కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజును చూసి సీఎం చంద్రబాబునాయుడు 'అశోక్ గారూ.... ఇంత ఎండలో వచ్చేశారా' అంటూ సరదాగా ప్రశ్నించారు. దీనికి అశోక్‌గజపతిరాజు స్పందిస్తూ... 'మా నాయకుడు వస్తే... నేను రాకుండా ఉండగలనా' అన్నారు. దీంతో సీఎం ఒక్కసారిగా నవ్వేశారు. గతంలో తాను ప్రాతినిధ్యం వహించిన పార్లమెంటరీ నియోజక వర్గం కూడా ఇదే కదా అని గుర్తు చేశారు. ప్రస్తుత ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చాలా చక్కగా చేస్తున్నారంటూ అశోక్ గజపతిరాజు.. కలిశెట్టి భుజం తట్టారు. దీనికి సీఎం స్పందిస్తూ.. 'అవును. ఇక్కడే కాదు.. ఢిల్లీలో కూడా ఎంపీ అప్పలనాయుడు తనదైన రీతిలో పని చేసుకుంటున్నార'ని సీఎం అభినందించారు.



చంద్రబాబుతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు

ఇప్పటికీ మేమే మీతోడు!

- జోరుగా విసనకర్రల అమ్మకాలు

రాజాం రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా.. ఖరీదైన ఏసీలు, కూలర్లు ఇళ్లలోకి వచ్చి చేరుతున్నా.. సంప్రదాయ విసనకర్రలకు మాత్రం డిమాండ్ తగ్గలేదు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ కోతల సమయంలో ఇవి ఎక్కువ ఉపయోగపడుతున్నాయి. పట్టణాల్లోనూ ఇటీవల అనేక మంది చేతుల్లో ఇవి కనిపిస్తున్నాయి. వీటితో పాటు కొవ్వొత్తులకూ డిమాండ్ పెరిగింది. రోజు రోజుకూ ఎండ తీవ్రమవుతుండడం... ఉదయం పది గంటల నుంచే వేడిగాలులు పెరుగుతుండడంతో పాటు విద్యుత్ సరఫరాలో తరచూ ఏర్పడుతున్న అంతరాయంతో వీటికి డిమాండ్ పెరిగింది. ఒకప్పుడు రూపాయికో.... రెండు రూపాయలకో దొరికిన విసనకర్ర ధర నేడు రూ.15 నుంచి రూ.20 పలుకుతోంది. కొవ్వొత్తుల ధరలూ కొండెక్కాయి. చిన్నపాటి ఆరు కొవ్వొత్తుల ప్యాకెట్ రూ.20 కాగా, పెద్దవి ఒక్కొక్కటి రూ.20 నుంచి రూ.50 వరకూ మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి.



విసనకర్రలు అమ్ముతున్న వ్యక్తి



108 శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు

108 శివలింగాలకు పూజలు

కొత్తవలస, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మికాపల్లి గేట్ సమీపంలోని ఓం సదనంలో శనివారం మాసశివరాత్రి, శనిత్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 శివలింగాలకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. నవగ్రహ పూజ, రుద్రహోమం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. శనివారం మాసశివరాత్రి, శనిత్రయోదశి అరుదుగా వస్తుంటాయని, ఇటువంటి రోజున శివలింగానికి రుద్రాభిషేకాలు నిర్వహిస్తే మంచి ఫలితాలను సాధించవచ్చునని సదనం నిర్వాహకులు అంపోలు ఉమామహేశ్వర శర్మ తెలిపారు. కార్యక్రమంలో అర్చకుడు కిరణ్ కుమార్ శర్మ పాల్గొన్నారు.




ఈవీఎంల భద్రతపై చర్చిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

ఈవీఎంల గోదాం తనిఖీ

నెల్లిమర్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాంను శనివారం కలెక్టర్ అంబేడ్కర్ తనిఖీ చేశారు. ఈవీఎంల గోదాం షట్టర్లకు వేసిన సీల్, ఈవీఎంల భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట డీఆర్‌వో ఎస్.శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ సుదర్శనరావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కరరావు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు రూపమిస్తూ.. ఆధ్యాత్మికత వైపు మళ్లిస్తూ..

- ఇదీ జగన్నాథం విశిష్టత
- శిల్పకళా ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు



పాతబొబ్బిలి జంక్షన్‌లో జగన్నాథం తయారు చేసిన ఆంజనేయ స్వామి విగ్రహం

ఈదుబిల్లి జగన్నాథం

జగన్నాథం నిర్మించిన ఆలయం

బొబ్బిలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆలయంలో దేవుడు మాత్రమే కాదు. ఆ పరిసరాలు.. అక్కడి శిల్పాలు... వాతావరణం అంతా ఆధ్యాత్మికత వైపు మనల్ని మళ్లించాలి. అంటే.. ఆ శిల్ప సంపద మనల్ని ఆకట్టుకోవాలి. పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండాలి. ప్రసిద్ధి చెందిన దేవాలయాలన్నిటా కనిపించేది ఇదే. ప్రస్తుత తరం వివిధ ప్రాంతాల్లో నిర్మిస్తున్న దేవాలయాలు... అక్కడి శిల్పకళలో జీవం ఉట్టిపడేలా తీర్చిదిద్దే బాధ్యతను తీసుకుంటున్నారు బొబ్బిలికి చెందిన ఈదుబల్లి జగన్నాథం. పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం గౌరీపురంలో జన్మించిన జగన్నాథం వృత్తిరీత్యా సుమారు పాతికేళ్లుగా బొబ్బిలి పట్టణంలో స్థిరపడ్డారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో శిల్పాగమ పాఠశాలలో శిల్పకళకు సంబంధించి మూడేళ్ల డిప్లమో కోర్సు పూర్తి చేశారు. తమిళనాడుకు చెందిన కె.మనోహర్ అనే శిల్ప కళాచార్యుని శిష్యరికంలో శిల్ప కళకు సంబంధించి పూర్తిస్థాయిలో పట్టు సాధించారు. సామాన్య రైతు దంపతులైన ఈదుబిల్లి తవిటినాయుడు- గుంపమ్మ దంపతులకు జగన్నాథం జన్మించారు. ఆయన సోదరుడు అప్పల స్వామి సాలూరులో ఉంటూ దేశ వ్యాప్తంగా అనేక ఆలయాలలో శిల్పకళా నైపుణ్యాన్ని చాటుకున్నారు. తన సోదరుడి స్ఫూర్తితో జగన్నాథం ఇటువైపు అడుగులు వేశారు.

రూ.60 వేతనంతో ప్రారంభమై...

తమిళనాడుకు చెందిన మనోహర్ దగ్గర 1996లో రోజుకు రూ.60 కూలీతో తన ప్రస్థానం ప్రారంభమైందని జగన్నాథం తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు, ఒడిశా, తమిళనాడు, హైదరాబాద్, ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలలో ఇంతవరకు 164 ఆలయాల నిర్మాణంలో ఆయన భాగస్వాములయ్యారు. గిజబ, పెంట శ్రీరామపురం గ్రామాలలో నిర్మించిన శివాలయాలు, పార్వతీపురం మన్యం జిల్లా దలాయివలస, నవిరిలో నిర్మించిన శ్రీరామమందిరాలు, కోరపు కృష్ణాపురంలో నిర్మించిన ఆలయాలు మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాయని చెప్పారు. తన కళానైపుణ్యంతో అనేక సత్కారాలు అందుకున్నారు జగన్నాథం. ఆగమ శాస్త్రం, వాస్తు శాస్త్రం ప్రకారం పండితుల సూచనలతో ఆలయాలు నిర్మాణం చేపడతామని చెప్పారు. బొబ్బిలిలోని వేణుగోపాలస్వామి ఆలయ గాలిగోపురం నిర్మాణంలో పాలుపంచుకునే భాగ్యం తనకు కలిగిందని జగన్నాథం చెబుతున్నారు. పాతబొబ్బిలి జంక్షన్, పట్టణంలోని అగ్రహారం వీధిలో ఇటీవల నిర్మించిన రెండు ఆంజనేయ స్వామి ఆలయాలు తనకు మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చి పెట్టాయని జగన్నాథం తెలిపారు. శిల్పకళకు సంబంధించిన వివిధ గ్రంథాలను నిత్యం అభ్యసిస్తుంటానని, ప్రముఖుల సలహాలు, సూచనలు స్వీకరిస్తానని అంటున్నారు. జ్యోతిష్యంలో ప్రవేశం సంపాదించానని, ప్రవచనాలు చెబుతుంటానని జగన్నాథం వివరించారు.

గుర్తు పట్టేస్తాయ్

- కేసుల ఛేదనలో కీలకంగా పోలీసు జాగిలాలు
- ఎన్నో కేసుల్లో సత్ఫలితాలు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి)

పోలీసు కేసుల ఛేదనలో జాగిలాలు చాలా కీలకంగా వ్యవహరిస్తున్నాయి. ఇటీవల నమోదైన అనేక కేసుల్లో నిందితులను గుర్తించాయి. జిల్లాలో నాలుగే ఉన్నప్పటికీ దేనికదే దీటుగా దూసుకెళ్తున్నాయి. నేరగాళ్లను హడలెత్తిస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతం నాలుగు జాగిలాలు ఉన్నాయి. వీటిని పోలీసులు ఎంతో ప్రత్యేకంగా సంరక్షిస్తున్నారు. అంతకంటే ఎక్కువగా మెలకువలపై శిక్షణ ఇస్తున్నారు. బెల్జెన్ జాతికి చెందిన లక్కీ (2 ఏళ్ల నాలుగు నెలలు) ట్రేకర్‌గా సేవలు అందిస్తోంది. దీనికి హేండ్లర్‌గా జె.కిషోర్‌కుమార్ వ్యవహరిస్తున్నారు. లేబరోడర్ రిట్రవర్ జాతికి చెందిన రివ్యా (6 ఏళ్ల తొమ్మిది నెలలు) ఎక్స్‌ప్లోజివ్ (బాంబులు, వీవీఐపీ, వీఐపీ) సేవలు అందిస్తోంది. దీనికి హేండ్లర్‌గా వై.ప్రేమ్‌కుమార్ వ్యవహరిస్తున్నారు. లేబరోడర్ రిట్రవర్ జాతికే చెందిన రూబీ (ఆరేళ్లు) కూడా ఎక్స్‌ప్లోజివ్ (బాంబులు, వీవీఐపీ, వీఐపీ) సేవలు అందిస్తోంది. దీనికి వై.భరత్‌కుమార్ హేండ్లర్‌గా ఉన్నారు. మరో జాగిలం వేగ్ (మూడేళ్ల ఏడు నెలల వయసు) సంరక్షణను ఎస్‌కె షాజన్ చూస్తున్నారు.

- కేసుల ఛేదనలో బెల్జెన్ జాతికి చెందిన లక్కీ జాగిలం చాలా క్రియాశీలక పాత్ర పోషిస్తోంది. క్లూస్ టీంతో పాటు ఈ జాగిలం వెళ్తుంది. సంఘటన జరిగిన వెంటనే సంబంధిత ప్రాంతానికి వెళ్లాక నిందితుడు ఉపయోగించిన వస్తువులు, వస్త్రాలను పరిశీలిస్తుంది. దీంతో పాటు నిందితుల కదలికలను కూడా గుర్తిస్తుంది. తాజాగా గరివిడి మండలం శివరాం గ్రామంలో యువతిపై హత్యాయత్నం కేసులో లక్కీ జాగిలమే లొకేషన్, నిందితుడు వెళ్లిన రూట్‌ను గుర్తించి అతన్ని పట్టించడంలో కీలక భూమిక పోషించింది. దీంతో 24 గంటల్లోపే ఆ కేసులో ప్రధాన నిందితుడ్ని పోలీసులు పట్టుకున్నారు. నెల్లిమర్ల మండలం కొండపేటలో బాలుడిని హత్య చేసిన ఘటనలో నిందితులు ఇంటికి వెళ్లి గుర్తించింది. దీంతో పోలీసులు వెంటనే వారిని ఆదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. తెర్లాం మండలం నెమలాం గ్రామంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు హత్య సంఘటనలో నిందితులను గుర్తించడంలో లక్కీ పాత్ర ఎంతో ప్రశంసనీయం. వెంటనే నిందితులను అరెస్టు చేశారు.



రూబీ

రోజుకు రెండు పూటలే ఆహారం..

రోజుకు రెండు పూటలే ఆహారం అందిస్తారు. వేసవిలో పూర్తిగా కూలర్ల సంరక్షణలో ఉంచుతారు. హేండలర్లే వాటి ఆలన, పాలన చూస్తుంటారు. ఉదయం 6 గంటలకు నిద్రలేపి జాగిలాలకు వ్యాయామాలు చేయించడం ద్వారా దినచర్య ప్రారంభమౌతుంది. రోజు మొత్తమ్మీద 500 గ్రాముల ఆహారం ఇస్తారు.



లక్కీ



నేర పరిశోధనలో కీలకం..

ఎక్కడైనా ఘటన జరిగినప్పుడు నిందితులు వినియోగించే వస్తువులు, వస్త్రాలు, సంఘటన స్థలంలో ముద్రలను అవి గుర్తిస్తాయి. నిందితుల కదలికలు, వారు వెళ్లే ప్రదేశాన్ని చూపిస్తాయి. లక్కీ జాగిలం ఇటీవల జరిగిన సంఘటనల్లో కీలకంగా వ్యవహరించింది.

-జె.కిషోర్‌కుమార్, లక్కీ హేండలర్

ప్రజల తలసరి ఆదాయం పెంచండి

● కలెక్టర్ అంబేడ్కర్

నెల్లిమర్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసి లక్ష్య సాధనకు ముందడుగు వేయాలని కలెక్టర్ అంబేడ్కర్ అధికారులను సూచించారు. ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. శనివారం జరజాపుపేటలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో విజన్ 2047కు సంబంధించి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన విజన్ 2047కు అనుగుణంగా ప్రతి అధికారి గ్రామ స్థాయి నుంచి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ ప్రణాళికలను మే ఒకటో తేదీ నుంచి అమలు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఇక నుంచి సమీక్షలు ఉండబోవని, నేరుగా గ్రామాల్లోనికి వచ్చి అమలు తీరును పరిశీలిస్తానన్నారు. జిల్లాలో 3 లక్షల ఎకరాల్లో సాగుకు అవకాశం ఉండగా, కేవలం ప్రస్తుతం 1.8 లక్షల ఎకరాల్లోనే సాగు జరుగుతుందన్నారు. మిగిలిన భూమిలోనూ సాగు జరిగేలా దశల వారీగా అధికారులు ప్రయత్నించాలన్నారు. జిల్లాలో రోజుకు 9.5 లక్షల కోడి గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయని, వాటిని 10.5 లక్షలకు పెరిగేలా కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. ఏడు నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేసేందుకు 280 ఎకరాల భూమిని సిద్ధం చేసినట్టు వెల్లడించారు. భోగాపురం విమానాశ్రయానికి మూడు కిలో మీటర్ల దూరంలో 2 స్టార్ హోటళ్ల ఏర్పాటవుతున్నాయన్నారు. మరో 3 హోటళ్ల ఏర్పాటుకు యాజమాన్యాలు ముందుకు వచ్చాయన్నారు. గ్రామాల్లోని చెరువుల్లో చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమీక్షలో సీపీవో బాలాజీ, జిల్లా వ్యవసాయాధికారి రామారావు, పశుసంవర్ధక శాఖ జేడీ రమణ, ఉద్యాన శాఖ డీడీ జమదగ్ని, ఏపీఎంఐపీ డీడీ లక్ష్మీనారాయణ, ఎంపీడీవోలు, తహసీలార్లు, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.



ఎస్.కోట: మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

జీవన ప్రమాణాలు పెంచండి

● శృంగవరపుకోట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి ఉద్యోగులకు గ్రామస్థాయిలో అవగాహనతో పాటు ప్రజలకు మేలు జరిగేలా పనితీరు ఉన్నప్పుడే ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని కలెక్టర్ అంబేడ్కర్ అన్నారు. శనివారం సాయంత్రం శృంగవరపుకోట నియోజకవర్గ క్షేత్ర స్థాయి ఉద్యోగులతో సమీక్ష ఆయన నిర్వహించారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు బాగా పనిచేయాలన్నారు. నెలాఖరుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. ఉత్పత్తి, ఉత్పాదకత, నాణ్యతను పెంచడంపై దృష్టి సారించాలన్నారు. గుడ్లు, పాలు, మాంసం ఎగుమతి చేసే స్థాయికు వెళ్లాలన్నారు. త్వరలో ప్రతి మండలంలో మహిళ సంఘాల ఆధ్వర్యంలో పౌల్ట్రీలను ఏర్పాటు చేస్తామన్నారు. భోగాపురం విమానాశ్రయం పూర్తయితే ఈ రంగం ఊపందుకుంటుందన్నారు. సమీక్షలో వ్యవసాయ శాఖ జేడీలు వి.టి.రామారావు, డాక్టర్ వై.వి.రమణ, ఉద్యావన శాఖ డీడీ జమదగ్ని, ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ, ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఆనందరావు, సీపీవో పి.బాలాజీ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి మురళి, ఆర్డీవో డి.కీర్తి, తహసీల్దార్లు ఎం.అరుణకుమారి, ప్రసాదరావు, రాములమ్మ, నీలకంఠరావు, ఎంపీడీవో సతీష్ తదితరులు ఉన్నారు.

ముగ్గురు క్షేత్ర సహాయకుల సస్పెన్షన్

భోగాపురం, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): మండలంలో ముగ్గురు క్షేత్ర సహాయకులను డ్వామా పీడీ శారదదేవి సస్పెండ్ చేశారని ఏపీవో భాగ్యలక్ష్మి తెలిపారు. సామాజిక తనిఖీల్లో బయటపడిన అక్రమాలు కారణంగా పోలిపల్లి, లింగాలవలస, కవులవాడ గ్రామాలకు చెందిన క్షేత్ర సహాయకులను సస్పెండ్ చేశారని శనివారం ఆమె విలేకరులకు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాం రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో ఈనెల 27న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఏఈ కుమార్ తెలిపారు. అంతకాపల్లి సమీపంలోని సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శ్రీకాకుళం, పాలకొండ రోడ్డులోని అన్ని ప్రాంతాలతో ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు వివరించారు.

అమ్మవారి హుండీల లెక్కింపు రేపు

రాజాం రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి దేవస్థానంలో హుండీలను ఈనెల 28న లెక్కించనున్నట్టు దేవస్థానం ఈవో బలివాడ వెంకట మాధవరావు తెలిపారు. దేవాదాయశాఖ అధికారులతో పాటు ఆలయ కమిటీ సమక్షంలో లెక్కిస్తామన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కొత్తవలస, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలోని కుమ్మరబంజరులో గల కాశీవిశాలాక్షి ఆలయంలో శనివారం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6.30 గంటల వరకు నవగ్రహాలకు భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం కాశీ విశాలాక్షి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కల్కిబాబా దీక్షితులు పాల్గొన్నారు.

పెదమానాపురం సర్పంచ్‌గా ఆదినారాయణ

దత్తిరాజేరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమానాపురం సర్పంచ్‌గా గురుబిల్లి ఆదినారాయణ ఎన్నికైనట్టు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఇటీవల అనారోగ్యంతో పెదమానాపురం సర్పంచ్ గొటివాడ దాసు మృతి చెందిన విషయం విదితమే. దాంతో ఆయన స్థానంలో ఉప సర్పంచ్ ఆదినారాయణను సర్పంచ్‌గా నియమించారు.

గుళ్ల సీతారాంపురంలో ఇరువర్గాల దాడులు

సంతకవిటి,ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుళ్ల సీతారాంపురంలో శనివారం పొలంలోని చెట్టు విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పరస్పరం కర్రలతో దాడులు చేసుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. పొలం మధ్యలో గట్టుపై ఉన్న చెట్టు ఒక వర్గం కొట్టేయడంతో మరో వర్గం గొడవకు దిగారు. మాటామాటా పెరిగి పరస్పరం కర్రలతో దాడి చేసుకున్నారు. కొట్లాటలో ఇరువర్గాల వారు గాయపడ్డారు. క్షతగాత్రులు రాజాం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

రూ.600 వేతనం ఇవ్వండి

నెల్లిమర్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతనదారులకు 300 రోజుల పని దినాలు, రూ.600ల రోజువారీ వేతనం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన పూతికపేట మజ్జివానిబాయిలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు.

ట్రాఫిక్ పోలీసులకు సమ్మర్ కిట్స్


సమ్మర్ కిట్స్‌ను పంపిణీ చేస్తున్న ఎస్పీ

విజయనగరం క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా నగరంలోని 80 మంది ట్రాఫిక్ పోలీసులకు దాతల సహకారంతో సమకూర్చిన బ్యాగు, హేట్, వాటర్ బాటిల్‌తో కూడిన సమ్మర్ కిట్స్‌ను శనివారం ఎస్పీ వకుల్ జిందాల్ పంపిణీ చేశారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండుటెండలో ట్రాఫిక్ విధులు నిర్వహించడం చాలా కష్టంతో కూడినదన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వేసవిలో ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసుల పని గంటలను తగ్గించడంతో పాటు కొన్ని పాయింట్లు రద్దు చేశామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు లీలారావు, సూరినాయుడు, ఎస్ఐలు రవి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అదానీ కంపెనీకి భూములివ్వం

● రెవెన్యూ సిబ్బందిని అడ్డుకున్న మారిక గిరిజనులు


అధికారులను అడ్డుకుంటున్న గిరిజన నాయకులు

వేపాడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మారిక గిరిజనులకు జీవనాధారమైన భూములను అదానీ పవర్ ప్లాంట్‌కు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ యువకులు శనివారం ఆందోళనకు దిగారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ గిరిజన యువకులకు సారథ్యం వహించారు. గ్రామానికి వస్తున్న డీటీ సన్యాసినాయుడు, ఆర్ఐ రామలక్ష్మిలను వారు అడ్డగించారు. ఈ సందర్భంగా చల్లా జగన్ మాట్లాడుతూ అయామక గిరిజనులకు అండగా నిలవాల్సిన అధికారులు అదానీ సేవలో తరించడం ఘోరమన్నారు. భూములను అదానీకి రాసిస్తే మా బతుకులు ఏమవ్వాలని ప్రశ్నించారు. అదానీ పవర్ ప్లాంట్‌కు మారిక భూములను ఇచ్చే ప్రశక్తేలేదని తేల్చి చెప్పారు. గిరిజనులను ఉద్దేశించి డీటీ, ఆర్ఐ మాట్లాడుతూ ఈ విషయాన్ని జిలా ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. ఆందోళనలో గిరిజన నాయకులు గమ్మెల అప్పలనాయుడు, గమ్మెల శ్రీను, అర్జున్, గమ్మెల శోభనబాబు, జమ్మల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబ నాయుడుకు పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) ఇటీవల అనారోగ్యానికి గురైన తూర్పుకాపు వర్కింగ్ ప్రెసిడెంట్ మక్క సాయిబాబనాయుడును ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పరామర్శించారు. శనివారం మండలంలోని పెంట గ్రామంలోని ఆయన నివాసానికి ఎమ్మెల్యే వెళ్లారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంతకవిటి మాజీ ఎంపీపీ కోళ్ల అప్పలనాయుడు, రోటరీ క్లబ్ ఉత్తరాంధ్ర గవర్నర్ మక్క అప్పలనాయుడు, సీహెచ్.మహేష్, పి.శరత్‌కుమార్, పి.రామినాయుడు, టంకాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి సరాసరి వేతనం పెరగాలి: కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతనదారుల దినసరి వేతనం పెరిగేలా పనులు చేయించాలని కలెక్టర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉపాధి పనులపై శనివారం మధ్యాహ్నం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ఎండ తీవ్రత లేని సమయంలో పనులు చేయించాలన్నారు. వేతనదారులు వడ దెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీరు, నీడ ఏర్పాటు చేయాలన్నారు. జలవనరులును పెంచే ఫాంపాండ్స్, పూడికతీతలు, మరమ్మతులను మే నెలలో ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రతి వారం లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనులు పూర్తిచేయాలన్నారు. సమీక్షలో ఏపీవోలు, ఎంపీడీవోలు సమన్వయంతో పని చేయాలన్నారు.సమావేశంలోని డ్వామా పీడీ శారదదేవి ఉన్నారు.

గెస్టు లెక్చరర్ల సమస్యలు పరిష్కరించండి

● డిప్యూటీ సీఎంకు వినతిపత్రం అందజేత


డిప్యూటీ సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న గౌరినాయుడు

లక్కవరపుకోట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న గెస్టు లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను ఏపీ గెస్టు లెక్చరర్‌ల సంఘం గౌరవ అధ్యక్షుడు కిలారి గౌరినాయుడు కోరారు. శనివారం ఆయన్ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉగాది రోజున చేబ్రోలులో ఆయన ఇచ్చిన హామీని గుర్తుచేశారు. రెగ్యులర్ లెక్చరర్లతో సమానంగా పనిచేసినా గంటల లెక్క జీతాలు ఇవ్వడం బాగోలేదన్నారు. నెలవారీ జీతాలు ఇచ్చేలా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన ఆయన విద్యాశాఖాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. సాహిత్య పరంగా ఎన్నో రచనలు చేసిన గౌరినాయుడును పవన్‌కల్యాణ్ అభినందించారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

విజయనగరం క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రక్షణ, శాస్త్ర సాంకేతిక రంగాల్లో యువత రాణించాలని డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌లో కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సెలెన్స్, చేయూత ఫౌండేషన్ సొసైటీ సంయుక్తంగా యువ సమ్మేళనాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయనతో పాటు ఎస్పీ వకుల్ జిందాల్ హాజరయ్యారు. డాక్టర్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ, భారతదేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రపంచంలోని ఇతర దేశాల కంటే ముందు ఉందన్నారు. యువత అవకాశాలను అందిపుచ్చుకుని రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ డ్రగ్స్‌తో జీవితాలు సర్వనాశనం అవుతుందన్న విషయాన్ని యువత గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో దాట్ల కీర్తి, ఎండీ ఖలీల్‌బాబు, రవిచంద్రారెడ్డి, ఎం.రాము, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరి


కచేరీ నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం బాబామెట్ట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్య సోమయాజులు కాశీపతి భవనంలో ఫ్రెండ్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ శనివారం సంగీత కచేరీ నిర్వహించింది. అముక్తమాల్యద, సుష్మ పలు గీతాలను ఆలపించగా, సంస్థ కార్యదర్శి మండపాక రవి మృదంగంపై, రామ్‌చరణ్ వయోలిన్‌పై వాయిద్య సహకారం అందించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు నిర్వహించిన కార్యక్రమంలో గోపాలరావు, వంకాల నర్సింహం, కోడూరి కృష్ణమూర్తి, కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

విస్తృతంగా తనిఖీలు


విజయనగరం రైల్వేస్టేషన్‌లో డాగ్ స్క్వాడ్ తనిఖీలు..


గరివిడిలో లాడ్జిని పరిశీలిస్తున్న చీపురుపల్లి సీఐ

విజయనగరం క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, లాడ్జిలు, మల్టీప్లెక్స్ థియేటర్స్ రైతు బజార్లలో శనివారం డాగ్ స్క్వాడ్, మెటల్ డిటెక్టర్‌తో విస్తృతంగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాది దాడి నేపథ్యంలో భద్రతా హెచ్చరికల దృష్ట్యా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు విస్తృతంగా సోదాలు చేపట్టారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. ● గజపతినగరం: కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడుల నేపథ్యంలో శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సీఐ ఎ.జి.వి.రమణ, ఎస్ఐ కిరణ్‌కుమార్ నాయుడు తనిఖీలు చేపట్టారు. ఎస్పీ ఆదేశాల మేరకు బస్సులల్లో మారణాయుధాలు, గంజాయి రవాణా అరికట్టేందుకు సోదాలు నిర్వహించారు.● గరివిడి: గరివిడిలోని లాడ్జీలను శనివారం సాయంత్రం పోలీసులు తనిఖీలు చేశారు. కశ్మీర్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో సోదాలు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. చీపురుపల్లి సీఐ జి.శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల్లో గరివిడి ఏఎస్ఐ రమణ పాల్గొన్నారు. ● చీపురుపల్లి: అసాంఘిక చర్యలకు ఆస్కారం లేకుండా లాడ్జి యజమానులు జాగ్రత్త వహించాలని ఎస్ఐ ఎల్.దామోదరావు సూచించారు. శనివారం ఆయన పట్టణంలోని పలు లాడ్జిలను తనిఖీ చేశారు. తగిన ఆధారాలు చూపించని వారికి వసతి నిరాకరించాలన్నారు.

రామతీర్థంలో ఇరువర్గాల ఘర్షణ

● వ్యక్తికి గాయాలు ● పోలీసులకు పరస్పరం ఫిర్యాదులు

నెల్లిమర్ల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామతీర్థం గ్రామంలో పొలం వద్ద తాటిచెట్ల తొలగింపు విషయంలో ఇరువర్గాల మధ్య శనివారం ఘర్షణ తలెత్తింది. అదే గ్రామానికి చెందిన నవగట్ల పైడిరాజుకు తలకు తీవ్ర గాయమైంది. దాంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ మరింత పెద్దదైంది. టీడీపీకి చెందిన తాడి సత్యనారాయణ, జనసేన పార్టీకి చెందిన నవగట్ల పైడిరాజు మధ్య వివాదం మరింత ముదిరింది. దాంతో నెల్లిమర్ల పోలీసులకు రెండు వర్గాల నాయకులు ఫిర్యాదు చేసుకున్నారు.

వ్యవసాయ పంపుసెట్ల వైర్ల చోరీ

మెరకముడిదాం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరంలో శనివారం పొలాల్లోని వ్యవసాయ మోటార్ల వైర్లు చోరీకి గురయ్యాయి. భీమవరం గ్రామానికి చెందిన రఘుమండ జయలక్ష్మి, బండపు దాలప్పయ్య, బండపు ఎరకయ్య, బండపు చినప్పయ్య, రఘుమండ అప్పలస్వామిలకు చెందిన వ్యవసాయ మోటార్ల వైర్లు దొంగిలించారు. గతంలో పలుమార్లు ఇలాగే జరిగిందని బాధితులు ఆవేదన వెలిబుచ్చారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు.

అజెండాలోని అంశాలకు ఆమోదం


స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో మేయర్ లక్ష్మి

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం సాయంత్రం మేయర్ వి.వి.లక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అజెండాలో పొందుపరిచిన 35 అంశాలను చర్చించిన అనంతరం కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేశ్ బీసీ కార్పొరేషన్ రుణాల విషయమై చర్చించారు. సంబంధిత జాబితాను అందజేయకపోవడంపై టీపీఆర్‌వో సింహాచలంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరును మార్చుకోవాలని హితవు పలికారు. జగనన్న మహిళా మార్ట్ కోసం సేకరించిన నిధులు రూ. 27 లక్షలు ఏమయ్యాయో సమాధానం చెప్పాలని సిటీ మిషన్ మేనేజరు సన్యాసిరావును ప్రశ్నించారు. వాటిని తక్షణమే డ్వాక్రా సంఘం మహిళలకు తక్షణమే అదజేయాలన్నారు. మేయర్ లక్ష్మి మాట్లాడుతూ ప్రజా అవసరాలు తెలుసుకుని వాటిని ప్రశ్నించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామన్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చేపడుతున్న ముందస్తు చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయన్నారు. సమావేశంలో కమిషనర్ పి.నల్లనయ్య, సహాయ కమిషనర్ కె.అప్పలరాజు, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణక్య, జి.వి.రంగారావు, రేగాన రూపావతిదేవి, సుంకరి నారాయణస్వామి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

తొమ్మిది రోడ్లకు రూ.7.55 కోట్లు


నిధుల మంజూరు ప్రతులు చూపుతున్న నాయకులు

రేగిడి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రేగిడి మండలంలో తొమ్మిది గ్రామీణ రోడ్లకు ఎట్టకేలకు మహర్దశ పట్టనుందని డీసీసీబీ మాజీ వైస్‌చైర్మన్ దూబ ధర్మారావు, మండల పార్టీ అధ్యక్షుడు కిమిడి అశోక్‌కుమార్, సీనియర్ నాయకులు పాలూరి రామినాయుడు, పాలవలస రామచంద్రినాయుడు, కోడిశ సర్పంచ్ గురవాన రమేశ్ తెలిపారు. రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ చొరవతో రూ.7.55 కోట్లు మంజూరయ్యామని వారు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రూ.1.56 కోట్లతో చిన్నయ్యపేట-రేగిడి రోడ్డు, రూ.1.58 కోట్లతో వెంకమ్మపేట మీదుగా కందిశ-కోడిశ రోడ్డు, రూ.62 లక్షలతో చిన్నకోడిశ-పెద్దకోడిశ రోడ్డు, రూ.85 లక్షలతో కోడిశ-అంబాడ రోడ్డు, రూ.70లక్షలతో అంబఖండి-వావిలవలస ఎంఆర్‌పీ ప్రాజెక్టు రోడ్డు, రూ. 110 లక్షలతో కాగితాపల్లి-పెద్దశిర్లాం రామాలయం రోడ్డు, రూ.46 లక్షలతో కొమిర-గోపింపేట రోడ్డు, రూ.48 లక్షలతో కొండవలస-నీలావలస రోడ్డు, రూ.20 లక్షలతో సరసనాపల్లి- జోడుబందల రోడ్డుకు మంజూరయ్యాయన్నారు. ఈ రోడ్ల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

'కొత్త పింఛన్లు ఎక్కడ?'

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కొత్త పింఛన్లు ఎక్కడని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. భర్త చనిపోతే, ఆ పింఛన్‌ను భార్యకు బదిలీ చేస్తున్నారు తప్ప కొత్తగా ఇవ్వడం లేదని విమర్శించారు. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కొత్తగా పింఛన్లు ఇస్తున్నామని గొప్పగా చెప్పుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వం ఆరు నెలలకు ఒకసారి అన్ని సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించి అమలు చేసేవారన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడుస్తున్నా ఏ ఒక్క పథకం కూడా అమలు చేయలేదన్నారు. సమావేశంలో వైసీపీ నాయకులు వర్రి నర్సింహమూర్తి, జైహింద్‌కుమార్, మీసాల వడూలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సరుకులు అందజేయండి

మెరకముడిదాం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను డీలర్లు సకాలంలో విడిపించి ఎండీయూ ఆపరేటర్ల ద్వారా లబ్ధిదారులకు అందేలా కృషి చేయాలని తహసీల్దార్ అజురఫీ జాన్ కోరారు. శనివారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ డీలర్లకు ఇచ్చిన జాబితా ప్రాప్తి మేరకు లబ్ధిదారుల ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలన్నారు. మండలంలో గర్భాం, సాతాంవలస, మెరకముడిదాం సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈకేవైసీలను జూన్ నెలాఖరునాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో సీఎస్‌డీటీ నాగలక్ష్మి, డీలర్ల సంఘం జిల్లా డివిజనల్ ఉపాధ్యక్షుడు కెంగువ శ్రీను, మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు సుంకరి జయసింహనాయుడు, ఉపాధ్యక్షుడు గొర్లె ఆనంద్ పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళి


గజపతినగరంలో ర్యాలీ..



బొండపల్లిలో..



సంతకవిటిలో..



విజయనగరంలో..

గజపతినగరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంతో పర్యాటకులపై పాక్ ఉగ్రవాదుల దాడిని బీజేపీ నాయకుడు దొగి దేముడు ఖండించారు. ఉగ్రదాడిని ఖండిస్తూ పార్టీలకు అతీతంగా శనివారం స్థానిక అభయాంజనేయస్వామి ఆలయం నుంచి నాలుగురోడ్ల జంక్షన్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. దాడుల్లో మృతి చెందివారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.కార్యక్రమంలో వర్మరాజు, తౌడు తదితరులు పాల్గొన్నారు.

● సంతకవిటి: కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ శనివారం మండల పరిధిలోని మామిడిపల్లిలో యువత కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కొల్ల యశస్, వైస్ సర్పంచ్ కురిటి మహేశ్, కొల్ల రామినాయుడు, సత్తారు గోపాలరావు, కాశీబాబు, నెల్లి సతీష్, సాయి, అనిల్ పాల్గొన్నారు.

● బొండపల్లి: కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడికి నిరసనగా స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దారు ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. 26 మంది పర్యాటకుల ఆత్మలకు శాంతి కలగాలని కోరుతూ కొవ్వొత్తులతో మానవహారం నిర్వహించారు.

● విజయనగరం బాబామెట్ట: కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని ఖండిస్తూ శనివారం నగరంలో మొబైల్ షాప్స్ జిల్లా అసోసియేషన్ కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టింది. నగరంలోని ప్రధాన కూడళ్ల మీదుగా ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో అసోసియేషన్ ప్రతినిధులుతో పాటు, ప్రజాసంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట ఇచ్చాం.. నిలబెట్టుకున్నాం

(ఐదో పేజీ తరువాయి)

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తాం. తొమ్మిది ఫిషింగ్ హార్బర్లు సిద్ధం చేస్తున్నాం. బోట్లు కొనిచ్చి గ్రామాన్ని ఒక సెంటర్‌గా తీసుకుని ఆర్థికంగా ఆదుకుంటాం. ఏడాదిలో బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్‌ను పూర్తిచేసి ప్రారంభిస్తాం. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు కోరిన విన్నపాలల్లో నారాయణపురం, మడ్డువలస స్టేజ్-2, తోటపల్లి కాలువ.. ఈ మూడు పూర్తి చేసి అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటా' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అనంతరం ఆయన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు.

చర్చల దశలోనే ఆయుధ కర్మాగారం

● ఆర్డీవో రామ్మోహనరావు


మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహనరావు

బాడంగి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఆయుధ కర్మాగారం ఏర్పాటు చర్చల దశలోనే ఉందని ఆర్డీవో రామ్మోహనరావు స్పష్టంచే శారు. శనివారం ఆయన బాడంగి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించా రు. ఈసందర్భంగా ఆయుధ కర్మాగారం ఏర్పాటుపై విలేకర్లు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ విధంగా సమాధానం ఇచ్చారు. కర్మాగారం ఏర్పాటు చర్చల దశలోనే ఉందని, ఒకవేళ కర్మాగారం ఏర్పాటు చేస్తే రైతులకు మంచి ప్యాకేజీ ఇచ్చేందుకు ప్రభుత్వం, ఉన్నతాధికారులు కృషి ఉంటుందని చెప్పారు. ఇప్పటివరకు కేంద్రం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని తెలిపారు. ప్రస్తుతం ప్రభు త్వ భూమి సుమారు 200 ఎకరాలు ఉందని, అదనంగా భూమి అవసర మైతే రైతుల నుంచి సేకరిస్తామన్నారు. రెవెన్యూకు సంబంధించిన సమస్య లు ఏమైనా ఉంటే ఎప్పటికప్పుడు సిబ్బంది ద్వారా పరిష్కరించుకోవాలన్నా రు. ముఖ్యంగా ఇసుకను అక్రమ రవాణా చేస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకునేందుకు వెనుకడుగు వేసేది లేదన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సుధాకర్, డిప్యూటీ తహసీల్దార్ ధనం, మండల సర్వేయర్ వెంకటరమణ, రీసర్వే డీటీ అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

● డీఎంహెచ్‌వో జీవనరాణి


పీహెచ్‌సీ వైద్యాధికారితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్ర జ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించా లని డీఎంహెచ్‌వో జీవనరాణి అన్నారు. పిరిడి పీహెచ్‌సీని ఆమె శనివారం సందర్శించారు. ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రఘువంశీ సమక్షం లో రికార్డులు తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులను ఎప్పటి కప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే 2025 ఏప్రిల్ నెలలో జరిగిన 4 సాధారణ డెలివరీ కేసుల స్థితిపై, గత సంవత్సరం జరిగిన 52 సంస్థాగత డెలివరీ కేసులపై ఆరా తీశారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీల్లో న్యాయం చేయండి

బొబ్బిలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల్లో అందరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. శనివారం స్థానిక ప్రైవేట్ విద్యాసంస్థలో ఏపీటీఎఫ్-257 జోనల్ సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కరాసు సింహాచలం అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీనియర్ నేత బంకురు జోగినాయుడు మాట్లాడారు. అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలని, స్పౌజ్ కేటగిరీలో ఎంటీఎస్ టీచర్లను చేర్చాలని కోరారు. రెగ్యులర్ ఉపాధ్యాయుల బదిలీల మాదిరిగానే 1998/2008 ఉపాధ్యాయులకు బదిలీలు జరిపి 12 నెలల జీతాన్ని వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా సింగిల్ టీచర్ స్కూళ్లలో రెండో ఉపాధ్యాయుడిని నియమించాలన్నారు. హైస్కూళ్లలో విద్యాహక్కు చట్టం ప్రకారం 35 మంది విద్యార్థులు దాటితే రెండో సెక్షన్ ఏర్పాటుచేయాలన్నారు. తెలుగు, ఇంగ్లీషు మీడియంలను సమాంతరంగా కొనసాగిస్తూ ఆమేరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను నియమించాలని, బదిలీల్లో బ్లాకింగ్ లేకుండా అన్ని ఖాళీలను చూపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎల్లయ్య, గొట్టాపు లక్ష్మణ, రామకృష్ణ, తెంటు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బందల పూడ్చివేతపై ఆరా

బొబ్బిలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ పరిధిలోని పాతబొబ్బిలికి వెళ్లే దారిలో బైరిసాగరం చెరువుకు ఆనుకుని ఉన్న బందలు, చిన్నపాటి చెరువుల పూడ్చివేతపై స్థానిక రెవెన్యూ అధికారులు శనివారం ఆరా తీశారు. కొంతమంది రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఈ బందలను పూడ్చేస్తున్నారని స్థానికుల నుంచి విమర్శలు రావడంతో తహసీల్దార్ మలపురెడ్డి శ్రీను స్పందించారు. ఆర్ఐ రామ్‌కుమార్, సర్వేయర్ సంతోష్‌ను శనివారం పంపించి ఆరా తీయమని ఆదేశించారు. ఈసందర్భంగా వారు వెళ్లి, పరిశీలించారు. కిచిడిబంద యథాతథంగానే ఉందని, పక్కనే ఉన్న మరో బందను రియల్‌ఎస్టేట్ వ్యాపారులు పూడ్చుతున్నారని, అది పూర్తిగా జిరాయితీ అని వారు తేల్చారు. బైరిసాగరంను ఆనుకుని గతంలో రెవెన్యూ శాఖ పరంగా హెచ్చరిక బోర్డులు పెట్టామని, వాటిని ఎవరో తొలగించేశారన్నారు. కిచిడీ బందను ఆనుకుని జరుగుతున్న పూడ్చివేతలను పరిశీలించామని, అవి లోతట్టు ప్రాంతాలే తప్ప పోరంబోకు గానీ, చెరువులు గానీ కాదని రెవెన్యూ అధికారులు నిర్ధారించారు.

అవిశ్వాస తీర్మానంపై రిట్ పిటిషన్

బొబ్బిలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావుపై ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసులపై హైకోర్టులో రిట్ పిటిషన్, స్టే పిటిషన్ వేసినట్టు వైసీపీ మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు తెలిపారు. శనివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. అవిశ్వాసం నోటీసులకు సంబంధించి ఎటువంటి నిబంధనలు పాటించలేదని, నిర్ణీత ప్రోఫార్మాలో సంతకాలు కూడా చేయలేదని, దీనిపై కోర్టులో వేయగా వాదనలు కూడా పూర్తయ్యాయన్నారు. సోమవారం నాటికి కోర్టు వాయిదా వేసిందన్నారు. ఆర్డీవో నేతృత్వంలో బొబ్బిలి మున్సిపల్ ప్రత్యేక సమావేశం నిర్వహించి చైర్మన్‌పై అవిశ్వాసం అంశాన్ని చర్చించనున్న నేపథ్యంలో తమ పార్టీకి చెందిన మొత్తం 20 మంది కౌన్సిలర్లకు విప్ జారీ చేసినట్లు శంబంగి తెలిపారు. అవిశ్వాసంపై సంతకాలు పెట్టిన కౌన్సిలర్లంతా మనసు మార్చుకుని, అవిశ్వాసం ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, తూముల రామసుధీర్, తమ్మిరెడ్డి దామోదరరావు, డబ్ల్యూఎల్ఎన్ రాయలు పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేయాలి

బొబ్బిలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మే డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఎం.గోపాలం పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక కార్యాలయంలో పోస్టర్ విడుదల చేశారు. వి.రామ్మూర్తి, పిల్లా లక్ష్మణరావు, బి.సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలియో నిర్మూలనకు నిధుల సేకరణ

బొబ్బిలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ రోటరీ సంస్థ ఆదేశాల మేరకు పోలియో మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టేందుకు అవసరమైన నిధులను సమీకరిస్తున్నామని రోటరీ జిల్లా అధ్యక్షుడు జేసీ రాజు తెలిపారు. శనివారం రాత్రి ఆయన బొబ్బిలి పట్టణంలో పలు వాణిజ్య సంస్థలు, నివాసాలకు వెళ్లి విరాళాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు సిసింద్రీ శ్రీనివాస్, గెంబలి శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

అధ్వాన రహదారులకు మోక్షమెప్పుడో?

● అడుగడుగునా గోతులు..

వాహనదారులకు తప్పని అవస్థలు

గరుగుబిల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా కొన్ని రహదారులు ఇప్పటికీ అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయంలో రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు చేపట్టినప్పటికీ ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వహించడంతో ఆ నిధులు వెనక్కి మళ్లాయి. గుత్తేదారులు కూడా పనుల నిర్వహణకు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. దీంతో అధ్వాన రహదారుల్లోనే ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది. కొన్ని చోట్ల రహదారులు నిర్మించినప్పటికీ ఆ తర్వాత వాటికి మరమ్మతులు చేపట్టకపోవడంతో అవి గోతులమయంగా తయారయ్యాయి. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గరుగుబిల్లి మండలంలోని కొంకడివరం, సన్యాసిరాజుపేట, పెద్దూరు నుంచి బీవీ పురం, రావుపల్లి నుంచి కొత్తూరు, శివ్వాం నుంచి కొత్తూరు, మరుపెంట, సాంబన్నవలసతో పాటు పలు గ్రామీణ రహదారులు అడుగడుగునా గోతులమయంగా దర్శనమిస్తున్నాయి. చీకటి పడిందంటే ఈ దారుల్లో ప్రయాణం నరకాన్ని తలపిస్తుంది. గత ఐదేళ్లకు పైగా అధ్వాన రహదారులతో ప్రజలు కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం స్పందించి అధ్వాన రహదారులకు మోక్షం కలిగించాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారుల అభివృద్ధికి కృషి చేస్తాం

ఈ రహదారుల దుస్థితిపై కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి దృష్టికి పలువురు తీసుకువెళ్లారు. రహదారులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చొరవ తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.

కలెక్టర్‌కు నివేదికలు అందించాం

రహదారులు దుస్థితిపై మండల ఇంజనీరింగ్ అధికారి గౌరీశంకర్‌ను సంప్రదించగా.. రహదారులకు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. రహదారుల స్థితిపై కలెక్టర్‌కు నివేదికలు అందించామని, నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.


గోతులమయంగా కొంకడివరం రహదారి

ప్రతి కార్యకర్తకూ న్యాయం చేస్తా

● మంత్రి సంధ్యారాణి

సాలూరు/మక్కువ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పార్టీయే ప్రాణంగా పని చేసిన ప్రతి కార్యకర్తకు తప్పనిసరిగా న్యాయం చేస్తానని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు. మక్కువ మండల కేంద్రంలో ఓ కల్యాణ మండపంలో శనివారం ఆమె టీడీపీ కార్యకర్తలు, నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తన సొంత మండలమైన మక్కువ నుంచి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నానని అన్నారు. కొంతమంది వెన్నంటే ఉండి వెన్నుపోటు రాజకీయం చేశారని అన్నారు. ఎవరు ఎన్ని కుట్రాలు కుతంత్రాలు పన్నినా మక్కువ మండల ప్రజలు తనకు మద్దతు తెలిపి ఓటు వేసినందుకు కృతజ్ఞతలు చెబుతున్నానని అన్నారు. మజ్జిగౌరమ్మ అలయం నుంచి వంతెన వరకు సుమారు రూ.3 కోట్లతో రోడ్డుతో పాటు ఇరువైపుల కాలువలు నిర్మాణం చేపడతామని చెప్పారు. మరో రెండు రోజుల్లో ప్రధాన రహదారిలో వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు గుళ్ల వేణుగోపాల్‌నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. అనంతరం 21 పంచాయతీల నాయకులు, కార్యకర్తలతో ఆమె నేరుగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మెంధి సింహాచలం, మల్లేశ్వరరావు, గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

అన్ని వైపుల నుంచి వెళ్లొచ్చు

(ఐదో పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టింది. విశాఖ నుంచి భోగాపురం వరకూ తీరం వెంబడి ఆరు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్, విశాఖ మెట్రో, లంకెలపాలెం నుంచి విశాఖ నగరం మీదుగా వెళ్లి ఆనందపురం వద్ద 16వ నంబరు జాతీయ రహదారిని కలిసే రోడ్డు.. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు వివిధ మార్గాల్లో రహదారులు భోగాపురం ఎయిర్‌పోర్టుతో అనుసంధానించడంపై దృష్టిపెట్టారు.

23 రోడ్లు గుర్తింపు..

ఉత్తరాంధ్రలోని మూడు ఉమ్మడి జిల్లాల నుంచి జాతీయ రహదారికి అనుసంధానించేందుకు 23 రోడ్లను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. వీటిలో 18 రోడ్లను తొలిదశలోనే చేపట్టాలని నిర్ణయించారు. విశాఖ, విజయనగరం జిల్లాలకు సంబంధించి ఆనందపురం-అనకాపల్లి జాతీయ రహదారితో అనుసంధానించనున్నారు. విశాఖనగరం నుంచి 11 రోడ్లను అనుసంధానించాల్సి ఉంది. తొలి దశలో చేపట్టే 18 రహదారులకు రూ.500 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ రహదారుల్లో నేరుగా హైవేతో అనుసంధానించేవి 8 రోడ్లు మాత్రమే. అయితే 18 రోడ్లలో 11 గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు. మిగతా ఏడు రోడ్లు ఇప్పటికే ఉన్నాయి. వాటిని అభివృద్ధి చేయడం ద్వారా అందుబాటులోకి తేవచ్చు. విశాఖ జిల్లాలో 11 అనుసంధాన రహదారుల పొడవు 56.52 కిలోమీటర్లు, విజయనగరంలో 6 రహదారుల పొడవు 29.67 కిలోమీటర్లు, అనకాపల్లి జిల్లాలో ఒకే ఒక రహదారి ఉండగా దాని పొడవు 2.50 కిలోమీటర్లు.

పీపీపీ విధానంలో నిర్మాణం..

రాష్ట్ర ప్రభుత్వంలోని కీలక శాఖలు ఈ రహదారుల నిర్మాణంలో భాగస్వామ్యం కానున్నాయి. విశాఖ ప్రాంతీయ రీజనల్ బోర్డు (వీఎంఆర్‌డీఏ), జీవీఎంసీ, రోడ్లు భవనాల శాఖ సంయుక్తంగా ఈ రహదారుల నిర్మాణ పనులు చేపట్టనున్నాయి. పబ్లిక్, ప్రైవేటు పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో వీటి నిర్మాణం చేపడ్తారు. సీఎస్ఆర్ కింద మరికొన్ని రహదారులు పూర్తిచేసేందుకు కొన్ని పరిశ్రమల యాజమాన్యాలు ముందుకు వచ్చాయి. రోడ్ల అభివృద్ధి ప్రణాళికలు రూపొందాయి. భూ సేకరణకు సైతం సిద్ధమయ్యారు. తొమ్మిది నెలల్లో ప్రక్రియ పూర్తిచేయాలన్నది లక్ష్యం.

అనుసంధానించే రోడ్లు ఇవే..

విశాఖ జిల్లాలోని గుడిగుండం-ముదపాక, గంభీరం- జాతీయ రహదారి, పినగాడి-వేపగుంట, అడవివరం- గుడిగుండం, నేరేళ్లవలస-తాళ్లవలస, తగరపువలస -మూ లకుద్దు, విజయనగరం జిల్లాలోని మోదవలస-పోలిపల్లి, మోపాడ-సవరవిల్లి రోడ్లు నేరుగా జాతీయ రహదారితో అనుసంధానం అవుతాయి. విశాఖ జిల్లా నాతయ్యపాలెం నుంచి చుక్కవానిపాలెం రోడ్డును 18 మీటర్లకు విస్తరి స్తారు. శివశక్తినగర్ నుంచి హరితా ప్రాజెక్టు వరకూ 18 మీటర్లు ఉన్న రోడ్డును 24 మీటర్లకు విస్తరిస్తారు. పినగా డి- వేపగుంట రోడ్డును 45 మీటర్లు, అడవివరం -గుడి గుండం రోడ్డును 60 మీటర్లకు విస్తరిస్తారు. తగరపువల స-మూలకుద్దు రోడ్డును 45 మీటర్లకు పెంచుతారు. విజయనగరం జిల్లా అయినాడ కూడలి బొడ్డవలస నుం చి విజయనగరం రింగు రోడ్డు వరకూ ప్రస్తుతం ఉన్న 9 మీటర్లను 24 మీటర్లకు, సీతం కాలేజీ నుంచి జేఎన్‌టీ యూ వరకూ 24 మీటర్లు విస్తరించనున్నారు. కాగా విజ యనగరం జిల్లాకు సంబంధించి జాతీయ రహదారి వర కూ విస్తరించనున్న రహదారులకు సంబంధించి.. ముద పాక-చింతపాలెం రోడ్డు 2.70 కిలోమీటర్లు, మోదవలస- పోలిపల్లి 3.52 కిలోమీటర్లు, సీతం కళాశాల-జేఎన్‌టీ యూ 1.45 కిలోమీటర్లు, మోపాడ-సవరవిల్లి 7.50 కిలో మీటర్లు, బొడ్డవలస-విజయనగరం 6.50 కిలోమీటర్లు, అమతాం రావివలస-గుడివాడ రోడ్డు 8 కిలోమీటర్లు అనుసంధానించాల్సి ఉంటుంది.

మేల్కొనకపోతే.. ముప్పే!

(ఐదో పేజీ తరువాయి)

క్యాన్సర్ ముదిరి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఏ మాత్రం అనుమానం కలిగినా పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకుంటే ఈ వ్యాధి నుంచి తప్పకుండా కోలుకోవచ్చునని వైద్యులు చెబుతున్నారు.

స్క్రీనింగ్ పరీక్షలు ఇలా..

ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తోంది. జిల్లాలో 6,41,342 గృహాలు ఉండగా జనాభా 15,65,721 మంది ఉన్నట్లు అంచనా. ఇప్పటి వరకూ 4,58,722(71.53 శాతం) మందికి సర్వే నిర్వహించారు. సర్వే ఫలితాల్లో నోటి క్యాన్సర్ 3,390 మందికి, రొమ్ము క్యాన్సర్ 1,764, గర్భాశయ క్యాన్సర్ (సర్వేకల్ క్యాన్సర్) 1,534 ఉన్నట్లు గుర్తించారు.

వైద్యులు హెచ్చరిస్తున్నా..

అధికారులు ఎన్ని దాడులు నిర్వహించినా, ఎన్నిసార్లు హెచ్చరికలు చేసినా, జరిమానాలు విధించినా జిల్లా వ్యాప్తంగా పాలిథిన్, ప్లాస్టిక్ వినియోగంలో ఏమాత్రం మార్పు రాలేదనేది అధికారులకూ తెలిసిందే. పొగలు కక్కే టీ, సాంబార్, రసం, పప్పు, కూరలు ప్లాస్టిక్ కవర్లలో వేసి అమ్మకాలు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో చాలామంది అలాంటి వాటినే కొని తెచ్చుకుంటున్నారు. ఒకసారి వాడి పారేసే (సింగిల్ యూజ్) కవర్లు, టీ కప్పులపై నిషేధం ఉన్నా తనిఖీలు నామమాత్రంగా ఉండడంతో రోజురోజుకూ వినియోగం పెరుగుతోంది.

ఇవిగో ప్రత్యామ్నాయాలు..

భోజనాలకు పర్యావరణ హితమైన విస్తరాకులు, అరిటాకులు వినియోగించే అవకాశం ఉంది. చికెన్, మటన్, కూరలు, రసం, సాంబార్ వంటి వేడివేడి పదార్థాల కోసం కర్రీ పాయింట్లకు స్టీల్ డబ్బాలు తీసుకువెళ్లొచ్చు. టీ, కాఫీ, వేడి పాలు కోసం సైతం చిన్నపాటి స్టీల్ బాటిళ్లను వాడే వీలుంది. పళ్లు, కూరగాయలు, ఆకుకూరలు ఇతరత్రా వంట దినుసుల కోసం గుడ్డ సంచులు వాడే వీలున్నా వాటిని వినియోగించేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు.

అభివృద్ధికి వ్యవ'సాయం'

(ఐదో పేజీ తరువాయి)

పెర్రో అల్లాయిస్, శారదా, అల్ట్రాటెక్ సిమెంట్ (నిర్మాణ దశలో ఉంది), జామి మండలంలో శ్రీచక్ర సిమెంట్ పరిశ్రమలున్నాయి. చీపురుపల్లి నియోజకవర్గం మెరకముడిదాంలో పెర్రో అల్లాయిస్, బొబ్బిలిలో గ్రోత్‌సెంటర్, రాజాంలో జూట్, నెల్లిమర్ల నియోజకవర్గం పూసపాటిరేగ మండలంలో ఫార్మాకంపెనీలు ఉన్నాయి. జామి మండలం భీమసింగిలో సహకార చక్కెర కర్మాగారం మూత బడింది. నెల్లిమర్ల, కొత్తవలస మండలాల్లో జనపనార పరిశ్రమలు మూతబడ్డాయి, పెర్రో అల్లోయిస్ పరిశ్రమలు నష్టాల బాట పట్టడంతో ఏడాదిలో సగభాగం లేఆఫ్ ఇస్తున్నారు. పరిశ్రమల రంగంలో ఉన్న మైనింగ్, క్వారీయింగ్ సక్రమంగా నడవడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం జిల్లాకు చెందిన క్వారీల నుంచి పన్ను వసూలు బాధ్యతను ప్రైవేటు యాజమాన్యానికి అప్పగించడంతో మైనింగ్, క్వారీయింగ్‌పై భారం పడింది. దీంతో అవీ పనిచేయడం లేదు. పారిశ్రామిక రంగం వృద్ధిలో ఉన్నప్పుడే వివిధ రకాల వ్యాపారాలు సాగుతాయి. బ్యాంకింగ్, బీమా, రియల్ ఎస్టేట్ వంటివి కూడా ఊపందుకుంటాయి. పర్యాటకం, ట్రాన్స్‌పోర్టు వృద్ధిలోకి వస్తాయి. జిల్లాలో పారిశ్రామికీకరణ తక్కువగా ఉండడంతో సేవా రంగంపై వృద్ధిరేటు భారం పడుతోంది. ఇప్పటికిప్పుడు పారిశ్రామికీకరణ జరగడం కష్టం. అందుకే అందుబాటులో ఉన్న వ్యవసాయ రంగాన్ని వృద్ధిలోకి తీసుకొచ్చేందుకు ఆలోచన చేస్తున్నారు.

వ్యవసాయం వృద్ధిలోకి వస్తే..

వ్యవసాయ ఆధారితంగా ఉన్న ఉద్యానవనం, పశుపోషణ, మత్స్యసంపద, అడవుల ద్వారా అత్యధిక ఆదాయం సమకూర్చుకొనేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందుకు అధికారుల మేధస్సుకు పదును పెట్టి కొత్త ఆవిష్కరణలు సృష్టించాలన్నదే లక్ష్యం. వ్యవసాయంలో అధునాతన పద్ధతులు, ఎక్కువ లాభాలను తెచ్చే పంటలు, పశుపోషణ ద్వారా పాడిని వృద్ధి చేయడం, చెరువులను వృథాగా ఉంచకుండా చేపల పెంపకాన్ని చేపట్టడం తదితర పనులపై దృష్టిసారించింది. వీటికి అనుబంధంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను స్థాపించేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పటికే జిల్లాలో గజపతినగరం, కొత్తవలస, విజయనగరం తదితర ప్రాంతాల్లో ఎంఎస్ ఎంఈ పార్కుల ఏర్పాటుకు స్థలాలు అందుబాటులో ఉంచారు. వ్యవసాయం వృద్ధిబాట పడితే ఇవన్నీ కార్యరూపంలోకి వచ్చే అవకాశం ఉంది.

న్యూస్ బాక్స్

రేపటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

గరుగుబిల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల పరిధిలో ఈనెల 28 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నామని మండల గ్రంథాలయ నిర్వాహకుడు నల్ల మధుసూదనరావు తెలిపారు. ఈ మేరకు శనివారం గరుగుబిల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్ఎల్ పాత్రుడుకు సమాచారం అందించారు.

● రామభద్రపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈనెల 28 నుంచి జూన్ 26 వరకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంఈవో ఆమిటి తిరుమలప్రసాద్ తెలిపారు. ఆయన శనివారం స్థానిక శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు జూన్ 6వ తేదీన బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. గ్రంథాలయ అధికారిణి సత్యవాణి పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

సీతంపేట రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయ సమీపంలో ఉన్న రెల్లిపొదలకు శనివారం మధ్యాహ్నం సమయంలో నిప్పు అంటుకుంది. ఉన్నట్టుండి మంటలు ఎగిసిపడడంతో ఐటీడీఏ కార్యాలయ సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఏపీవో చిన్నబాబు స్పందించి, పాలకొండ అగ్నిమాపక శకటానికి సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. దట్టంగా పొగలు అలుముకోవడంతో ఐటీడీఏ సిబ్బంది ఇబ్బంది పడ్డారు. అధికారులు సకాలంలో స్పందించకపోతే మంటలు మరింత వ్యాపించేవి.

బాల్య వివాహాలపై అవగాహన

సీతంపేట రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్ర జ్యోతి): బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై శనివారం స్థానిక ఎంఎంఎస్ కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీవో రంగలక్ష్మి అవగాహన కల్పించారు. చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల కలిగే నష్టాలు, బాలల హక్కులు, జండర్ యూనిక్ క్వాలిటీ, డ్రాపౌట్స్ వంటి అంశాలపై సచివాలయ ఎంఎస్‌కేలు, ఏఎన్ఎం, ఆశావర్కర్, సీహెచ్‌డబ్ల్యూవో, వీవోలకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో సూపర్‌వైజర్లు లావణ్య, విస్సమ్మ, ఏపీఎం పార్వతీలు హాజరయ్యారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

పాలకొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని పోస్టాఫీస్ రోడ్డులో ఉన్న తాగునీటి ట్యాంకు ప్రధాన వాలు మరమ్మతులకు గురైందని నగర పంచాయతీ అధికారులు తెలిపారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ట్యాంకు పరిధిలోని 9, 10, 11, 12, 13, 14, 15, 16, 17, 18 వార్డులకు నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని చెప్పారు. మరమ్మతులు పూర్తయిన వెంటనే నీటిని సరఫరా చేస్తామన్నారు.